రెండు రోజుల పాటు రామ రాజ్య ప్రాశాసన్

బండ్లగూడ, జూలై 12: రామ రాజ్య ప్రాశాసన్ అయోధ్య జాతీయ రాజ్యసభను హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ ప్రాశాసక్ రాచూరి రాజశేఖర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని నాగారం గ్రామంలో శని వారం ఉదయం 8గంటలకు కార్య క్రమం ప్రారంభమవుతుందన్నారు. ఆదివారం సాయంత్రం 5గంటల వరకు కొనసాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు.

టీడీఆర్ విషయంలో తప్పుడు సమాచారం.. ఇద్దరి సస్పెండ్

బండ్లగూడ, జూలై 12: టీడీఆర్ విషయంలో ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారమిచ్చిన కేసులో రాజేంద్రనగర్‌లో గతంలో పనిచేసిన డిప్యూటీ సిటీ ప్లానర్ కృష్ణమోహన్, సెక్షన్ అధికారి కబీర్ ఉల్లాఖాన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ కథనం ప్రకారం.. ఉప్పర్‌పల్లిలో రోడ్డు విస్తరణ కోసం హెచ్ఎండీఏ అధికారులు పనులను చేపట్టారు. కొంత మంది గుర్తుతెలియని వ్యక్తు లు నకిలీ పత్రాలను సృష్టించి టీడీఆర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఈ స్థలాలపై దర్యాప్తు చేపట్టి వివరణ ఇవ్వాలని రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ అధికారులను హెచ్ఎండీఏ అధికారులు కోరారు. సెక్షన్ అధికారి కబీర్, డిప్యూటీ సిటీ ప్లానర్ కృష్ణమోహన్ వారికి తప్పుడు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకు న్న ఉన్నతాధికారులు అది తప్పుడు సమచారమని గుర్తించి, వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళా సాధికారతే లక్ష్యం

ఖైరతాబాద్, జూలై 12: మహిళా సాధికారతే లక్ష్యంగా ఫిక్కీ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 21వరకు హైటెక్స్ స్టైల్ తత్వా పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ ప్రియ తెలిపారు. సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో ఎగ్జిబిషన్ పోస్టర్లను మాజీ చైర్‌పర్సన్ రేఖ, కోక న్వీనర్ సుధతో ఆవిష్కరించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● పలు ప్రాంతాల్లో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు

బండ్లగూడ, జూలై 12: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని బండ్లగూడ జాగీర్ మున్సినల్ మేయర్ లతాప్రేమ్ గౌడ్ అన్నారు. ప్రతి శుక్రవారం ఉదయం పదిగంటలకు ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ అధికారులు డ్రైడే కార్యక్రమానికి హాజరయ్యారు. మేయర్ మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో పూల కుండీలు, తొట్లు, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణకు ఆయిల్ బాల్‌ను వదలాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొటర్ ముద్దం రాము, అధికారులతో కలిసి మేయర్ పూల మొక్కలను, కుండిలను శుభ్రం చేశారు.

బండ్లగూడ కార్పొరేషన్ కార్యాలయంలో ఫ్రైడే.. డ్రైడేలో కుండలను శుభ్రం చేస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్, కమిషనర్

రాజేంద్రనగర్, శివరాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డ్రైడేపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ బస్తీల్లో తిరిగి దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల వివరించారు. కార్యక్రమంలో డీసీ రవికుమార్, ఎంటామాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా..

మణికొండ: పరిసరాలను ప్రతిఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన జీవనాన్ని పొందుతామని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. ఫ్రై డే, డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. మలేరియా, డెంగ్యూ లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సంపుల్లో నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. తమ ఇంటి పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాలు పేరుకుపోకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోపాలవిజయ్, కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ జవాన్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, ప్రజా ప్రతినిధులు, కాలనీల వాసులు పాల్గొన్నారు.

మంచిరేవులలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ హాజరైన వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతిఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల సునీత, మాజీ జెడ్పీటీసీ రేఖ, ప్రేమ్, సంతోష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అంటువ్యాధులు దూరం..

ఎర్రగడ్డ: పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు దరిచేరవని బోరబండ స్వరాజ్‌నగర్‌లోని ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారి డాక్టర్ సుభాన్ అన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ సూచన మేరకు 'ఫ్రైడే.. డ్రైడే' కార్యక్రమంలో భాగంగా అంటు వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీని బోరబండ పుర వీధుల్లో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులను ఏర్పాటు చేశారు. విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్ సుభాన్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలు, వీధుల్లో పారిశుధ్యం, పొడి వాతావరణం ఉండే విధంగా ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. అదే విధంగా ఆహారపదార్థాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమలు కేవలం గంట సమయంలో లక్షలాది గుడ్లు పెడతాయని, దోమలుగా మారి విరుచుకుపడతాయని వివరించారు. ర్యాలీలో దవాఖాన సిబ్బంది బ్యానర్లను ప్రదర్శించారు.

దోమల నివారణకు ..

జూబ్లీహిల్స్: డెంగీ దోమల నివారణకు సమష్టిగా పోరాడాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఎంటమాలజీ ఏఈ రజిత, ఏఎంఓహెచ్ డాక్టర్ కె.రవి, యూసీడీ డీపీఓ ఆశా వెరోనికా, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల పుట్టకుండా.. కుట్టకుండా స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని వెంగళరావునగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన నిర్వహించారు. ఏఎంఓహెచ్ డాక్టర్ కవిత, ఎంటమాలజీ ఏఈ సావిత్రి, ఈఎఫ్ఏలు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిరేవులలో చైర్‌పర్సన్ నాగపూర్ణ, కమిషనర్ ప్రవీణ్‌రెడ్డి

కార్యక్రమంలో పాల్గొన్న చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ

సర్కారు దవాఖాన ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ అనురాగ్

విజయ వంటనూనెకు సాటి లేదు

ఆయిల్ మిల్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎండీ షేక్ యాస్మిన్ బాషా

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 12: విజయ వంట నూనెకు దేశ వ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని అందుకు అనుగుణంగా ఉత్పత్తి పెంచేందుకు విస్తరణ పనులు త్వరిత గతిన చేపట్టాలని, తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ ఎండీ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ శివరాంపల్లి విజయ ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. ప్యాకింగ్ విధానాన్ని, ఆయిల్ క్వాలిటీని, తీసుకునే జాగ్రత్తలను పరిశీలించారు. విజయ ఆయిల్‌కు ఉన్న డిమాండ్‌ను బట్టీ మెగా ఆయిల్ ప్లాంట్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని ఆమె ఆదేశించారు. కాంట్రాక్టర్, అధికారులు జాప్యంచేస్తే చర్యలు తప్పవన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు సమీప రాష్ట్రాలకు సరఫరా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం సుధాకర్‌రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, ఫిల్లింగ్ స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మోసం చేశారు.. న్యాయం చేయండి

హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న విజయరాఘవన్

హిమాయత్‌నగర్, జూలై 12: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లను నెల కొల్పి ఒకే ప్లాట్‌ను ఇద్దరు, ముగ్గురికి విక్రయించి తమను మోసం చేసిన రియల్టర్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేషనల్ సొసైటీ ఫర్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సలహాదారుడు విజయరాఘవన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండిశెట్టి సాయితేజ, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ.. కర్నూల్ జిల్లా వెంకటపురానికి చెందిన రియల్టర్ కుందూర్ మహేశ్వర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం సుభాన్‌పూర్‌లోని సర్వే నంబర్లు 13-9, 228, 98, 91, 224, 225లలో 21 ఎకరాల 31 గుంటల భూమిలో చట్ట విరుద్ధంగా వెంచర్లను ఏర్పాటు చేశాడని తెలిపారు. ఇందులో రాయదుర్గం ఎనుముల సురేందర్, కొల్లు దుర్గాప్రసాద్‌లతో పాటు మరికొంత మంది రియల్టర్ కుందూర్ మహేశ్వర్‌రెడ్డిని ఆశ్రయించి ప్లాట్లు కొనుగోలు చేశారు. ఒకే ప్లాట్‌ను ఇద్దరు, ముగ్గురికి అమ్మి సుమారు రూ.40 కోట్లకు పైగా డబ్బులను తీసుకొని మోసం చేశారని ఆరోపించారు. కొంత కాలంగా మహేశ్వర్‌రెడ్డి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని ఈ విషయంపై తాము ఆదాయ పన్నుశాఖ అధికారులను వినతిపత్రాన్ని అందజేశామని తెలిపారు. ఇతడిపై పలు పోలీస్‌స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ఈ అక్రమ వెంచర్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి తిరిగి డబ్బులు చెల్లించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

అసౌకర్యం కలుగకుండా అభివృద్ధి పనులు

వెంగళరావునగర్‌లో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్, జూలై 12: ప్రజలకు అసౌకర్యం కలుగకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం వెంగళరావునగర్ డివిజన్‌లోని వెంగళరావునగర్‌కాలనీలో రూ.35లక్షల వ్యయంతో వీడీసీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేదీప్యరావు, డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు, ఏఈ అవినాశ్, నాయకులు విజయ్‌ముదిరాజ్, కాలనీ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు, శ్యామ్‌రావు, సునీత, వేణు, అంజనేయులు, అంబటి రామకృష్ణ, పూజారీ బాలరాజు, కట్ట లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

రోడ్డు పనులపై సూచనలు చేస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

జూబ్లీహిల్స్, జూలై 12: రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలో రూ.81 లక్షలతో చేపడుతున్న వీడీసీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ మణిపాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కున్వర్, కాలనీ కమిటీ సభ్యులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీకి దోహదం

ఒప్పంద పత్రంతో రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 12: నగరంలో పేరు గాంచిన నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో, ఒప్పందం కుదుర్చుకోవడం అభినందనీయమని రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఆధునిక టెక్నాలజీని వ్యవసాయ కార్యకలాపాలలో వినియోగించుకునేందుకు దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ ప్రిన్సిపల్ కె.రమేశ్‌రెడ్డి, వర్సిటీల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కల్తీ ఉత్పత్తులపై అవగాహన

కల్తీని గుర్తించడంపై అవగాహన కల్పిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

జూబ్లీహిల్స్, జూలై 12: యూసుఫ్‌గూడ టీఎస్ఎస్‌పీ ప్రథమ పటాలంలో శుక్రవారం కల్తీ ఉత్పత్తుల గుర్తించేందుకు కమాండెంట్ పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

వైఎంసీఏ ఫిజికల్ డైరెక్టర్‌గా జార్జ్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా డాక్టర్ ఎజినె జార్జ్ నియమితులయ్యారు. శుక్రవారం సమావేశమైన వైఎంసీఏ బోర్డు డైరెక్టర్లు జార్జ్ ఎంపికపై తుది నిర్ణయం తీసుకున్నారు. బాస్కెట్ బాల్ క్రీడలో జార్జ్‌కు సుదీర్ఘ అనుభవముంది. అటు ప్లేయర్‌గా లెక్కకు మిక్కిలి పతకాలు సాధించడంతో పాటు తన శిక్షణలో మెరికల్లాంటి ప్లేయర్లను తీర్చి దిద్దాడు. సికింద్రాబాద్ వైఎంసీఏ ఆధ్వర్యంలో పలు క్రీడల్లో ప్లేయర్లకు శిక్షణ అందించడంలో జార్జ్ కీలకంగా వ్యవహరించారు.

తాను మరణిస్తూ..



ఖైరతాబాద్, జూలై 12: తాను మరణిస్తూ ఆరుగురికి కొత్త జీవితాన్నందించారు కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం, పెద్దమల్లారెడ్డికి చెందిన మెట్టు ప్రవీణ్ (27) ప్రైవేట్ ఉద్యోగి ప్రవీణ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు. ఈనెల 9న బైక్‌పై ఇంటికి వెళ్తుంగా మరో వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో గాయపడిన అతన్ని చికిత్స కోసం సూరారంకాలనీలో మల్లారెడ్డి నారాయణ వైద్యశాలలో చేర్పించారు. శుక్రవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల సమ్మతితో ప్రవీణ్ శరీరం నుంచి కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కండ్లను సేకరించారు.

జూబ్లీహిల్స్‌లో వన మహోత్సవం

జూబ్లీహిల్స్, జూలై 12: వన మహోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్య విజయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రగడ్డ చెస్ట్ హాస్పిటల్‌లో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, హాస్పిటల్ సూపరింటెండెంట్ మహబూబ్ ఖాన్, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్, మేనేజర్ యూసుఫ్‌పాషా, సూపర్‌వైజర్ అలీ, జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

చెస్ట్ హాస్పిటల్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గోపీనాథ్

పాఠశాలలో మొక్కలు నాటుతున్న జెడ్సీ అనురాగ్ జయంతి

మొక్కలు నాటాలి.. సంరక్షించాలి

జూబ్లీహిల్స్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఏఎంఓహెచ్ డాక్టర్ కె.రవి, యూసీడీ డీపీఓ ఆశా వెరోనికా, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్లేడుతో బెదిరించి డబ్బు డిమాండ్

జూబ్లీహిల్స్, జూలై 12: వ్యక్తిని బ్లేడుతో బెదిరించి డబ్బు డిమాండ్ చేసిన నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సింగాడికుంటకు చెందిన మెకానిక్ మొహమ్మద్ ఖాజా (23) గౌరీశంకర్ కాలనీకి చెందిన వ్యక్తిని ఈనెల 9న రాత్రి అడ్డుకుని బ్లేడుతో బెదిరించి రూ.5 వేలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశాడు. చుట్టపక్కల వాళ్లు అక్కడికి చేరుకోగానే పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదుతో ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిందితున్ని అరెస్ట్ చేశారు. బ్లేడ్‌తో పాటు 2 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బషీర్ అహ్మద్, ఎస్సై రవీందర్ పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

శంషాబాద్ రూరల్, జూలై 12: బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని బీజేపీ జాతీయ నాయకుడు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పిలుపునిచ్చారు. గురువారం శంషాబాద్ పట్టణంలోని మల్లికా కన్వేషన్‌హాల్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశాభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనకు దేశ ప్రజలు మొగ్గుచూపుతున్నారని వివరించారు. సమావేశంలో ఎంపీలు డీకే అరుణ, అరవింద్, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు పాలొన్నారు.

బస్తీ ఎన్నికల నేపథ్యంలో స్వల్ప ఉద్రిక్తత

బోరబండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే మాగంటి

ఎర్రగడ్డ, జూలై 12: బోరబండ డివిజన్ మధురానగర్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు ఈనెల 14న జరుగనున్నాయి. కాగా శుక్రవారం బస్తీలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకున్నది. ప్రస్తుత అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌తో కాంగ్రెస్ వర్గీయులు గొడవకు దిగారు. సమాచారం అందుకున్న బోరబండ పోలీసులు ఆనంద్‌తో పాటు గొడవకు దిగిన వ్యక్తిని ఠాణాకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఠాణాకు చేరుకున్నారు. సంఘటనపై ఆరా తీశారు. ఎన్నికలకు సిద్ధంగా ఉండాల్సింది పోయి రాద్ధాంతం చేయడం సబబు కాదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెళ్లగానే బోరబండ, రహ్మత్‌నగర్ కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, సీఎన్ రెడ్డి తమ అనుచరులతో పీఎస్‌కు చేరుకున్నారు. ఇరు వర్గాల నినాదాలతో పోలీసులు అక్కణ్ణించి పంపించివేశారు.

చేనేత కార్మికులకు చేయూత

పద్మశాలి భవన్‌లో ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎల్.రమణ

హిమాయత్‌నగర్, జూలై 12: చేనేత కార్మికులకు అన్నిరకాలు అండగా ఉంటూ వారికి చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ తెలిపారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం, వివర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను శుక్రవారం ఎమ్మెల్సీ ఎల్.రమణ, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కంద గట్లస్వామి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటుక రూప సదాశివంతో కలిసి ప్రారంభించారు.

పథకాలను కొనసాగించాలి

చేనేత కార్మికులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన పథకాలన్నిటిని కొనసాగించాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. చేనేత బతుకుల్లో వెలుగులు నింపి నేతన్నలను బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదు కుంటూ అండగా నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నేతలు పుట్ట పాండురంగయ్య, గడ్డం జగన్నాథం, కత్తుల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ.. పోలీసుల దాడి

బండ్లగూడ, జూలై 12: నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం ఓ గోదాంపై దాడిచేశారు. అక్కడి స్వాధీనం చేసుకున్న సరుకును ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. బుద్వేల్ గ్రీన్ సిటీలో ఓ వ్యక్తి నకిలీ పేస్ట్‌ను తయారు చేస్తున్నాడని ఎస్ఓటీ పోలీసులకు సమాచారం వచ్చింది. పోలీసులు ఆ కేంద్రంపై దాడి చేసి 15 లక్షల విలువజేసే సామగ్రిని స్వాదీనం చేసుకున్నారు. సీజ్ చేసిన ఆ సామగ్రిని ఫుడ్‌సేఫ్టీ అధికారులకు అప్పగించారు. ఈ కేసు దర్యాప్తులో ఉన్నదని పోలీసులు తెలిపారు.

డ్రగ్స్ కేసులో టాంజానియన్‌కు జైలు

శంషాబాద్ రూరల్, జూలై 12: డ్రగ్స్ కేసులో టాంజానియన్‌కు ఎల్బీనగర్ కోర్టు 12 ఏండ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధించినట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. డీఆర్ఐ అధికారుల కథనం ప్రకారం.. 2021, జూన్ 21న టాంజానియాకు చెందిన నిందితుడు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చాడు. తన బ్యాగులో 2980 గ్రాముల హెరాయిన్ తీసుకువస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధించిన పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించారు. దీంతో ఎల్బీనగర్ కోర్టు గురువారం నిందితుడికి 12 ఏండ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తు తీర్పు చెప్పింది.

బస్ కిందపడి ఆత్మహత్య

వెంగళరావునగర్, జూలై 12: రన్నింగ్ బస్ కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రమాదంగా భావించిన పోలీసులు.. అక్కడికి సమీపంలోని సీసీ కెమెరాల్లో లభించిన దృశ్యాల ఆధారంగా ఆత్మహత్యగా నిర్ధారించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఆత్రేయపురం నుంచి బీహెచ్ఈఎల్‌కు ఎస్ఆర్కే ట్రావెల్స్ బస్సు శుక్రవారం ఉదయం వస్తోంది. ఎస్ఆర్‌నగర్ మెట్రో స్టేషన్ వద్దకు వచ్చే సరికి డివైడర్ దాటుకుంటూ వచ్చిన గుర్తుతెలియని యువకుడు (35) రన్నింగ్ బస్సు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడిని యాచకుడిగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.